క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నగరి: పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు బడ్జెట్ సమావేశం, 11.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు.

నేడు మండల మీట్

నింద్ర: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ వేణు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

జీడీనెల్లూరు వాసుల ధర్నా

గంగాధరనెల్లూరు: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట గురువారం రాత్రి జీడీనెల్లూరు గ్రామస్తులు ధర్నా చేశారు. జీడీనెల్లూరుకు చెందిన విశ్రాంత వీఆర్వో రవీంద్రనాథ్‌రెడ్డి ఆయన కుమారుడు ద్విచక్రవాహనంపై వస్తుండగా పోలీసులు ఆపారు. రికార్డులు చూపించేలోపే విశ్రాంత వీఆర్వో పట్ల ఎస్‌ఐ దుర్భాషలాడి పోలీసు స్టేషన్‌లో కూర్చోబెట్టారు. ఏ తప్పు చేయకుండానే ఎందుకు విశ్రాంత వీఆర్వోను కూర్చోబెట్టారంటూ స్థానికులు పెద్దఎత్తున పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

మందుల తయారీ కేంద్రం పరిశీలన


మందుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేఈవో సదా భార్గవి

తిరుపతి తుడా: శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద ఫార్మసీలో నిర్మించిన మందుల తయారీ కేంద్రాన్ని గురువారం టీటీడీ జేఈవో సదా భార్గవి పరిశీలించారు. దాన్ని శుక్రవారం ఉదయం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను జేఈవో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, గోశాల డైరెక్టర్ హరనాథ రెడ్డి, ఈఈలు మనోహర్, మురళీకృష్ణ, డీఈ సరస్వతి, ఆయుర్వేద ఫార్మసీ సాంకేతిక అధికారి నారపరెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవతో వ్యక్తిత్వ వికాసం


మాట్లాడుతున్న వైద్యుడు కమలాకర్‌రెడ్డి

కార్వేటినగరం: సమాజసేవ ద్వారా వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ కమలాకర్‌రెడ్డి అన్నారు. గురువారం సుద్దగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్పెషల్ క్యాంపుల ద్వారా సమయ పాలన, కార్యనిర్వహణ పద్ధతులు, సేవ ద్వారా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, జీవిత నైపుణ్యాలను నేర్చుకోవాలని వివరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలో చేపట్టిన సేవలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ధనంజయ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ వెంకటేశన్, డాక్టర్ చంద్రశేఖర్, శివాలయం ఆలయ అధ్యక్షుడు మోహన్‌రాజు, వలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

కేవీబీపురం: మండలంలోని పెరిందేశం గ్రామంలో ఏటా నిర్వహించే జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు గురువారం ఎంపీపీ మునిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు చెంచుకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు నింద్ర, కళత్తూరు, శ్రీకాళహస్తి, వరదరయ్యపాళెం జట్లు తలపడ్డాయి. అందులో వరదయ్యపాళెం, కళత్తూరు జట్లు ప్రతిభ చాటి మొదటిరౌండ్‌లో విజేతలుగా నిలిచాయి. విజేత జట్లకు వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు చెంచుకృష్ణనాయుడు రూ.10,000 నగదు బహుమతి, మరో రూ.10 వేలు విలువ చేసే ఆరు వాలీబాల్స్, నాలుగు నెట్లను విరాళంగా అందించారు.

3న ఇంటర్వ్యూలు

నాయుడుపేట: నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మధుసూదన్‌వర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎంపీఈడీలో 55శాతం మార్కులు సాధించి, పీహెచ్‌డీ, యూజీసీ, నెట్, సెట్ అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఏప్రిల్ 3 ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ప్రకటనలో కోరారు.

వైభవం.. రాములోరి కల్యాణం..



వెదురుకుప్పం: కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, వేల్కూరులో శ్రీసీతారాముల కల్యాణం


పాతభజనగుడి వీధిలోని రామాలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు

- రాముల వారి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- హనుమంతవాహనం, సర్వభూపాలవాహనంపై స్వామివారు
- సీతారాముల కల్యాణాన్ని వీక్షించిన భక్తజనం


టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నగరి: మున్సిపల్, మండల పరిధిలో శ్రీరామనవమి ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. పట్టణ పరిధిలోని భేరివీధిలో ఉన్న కోదండరామాలయంలో, పాతభజన గుడి వీధిలోని రామాలయంలో, కొత్తపేట కోదండరామాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసి సుందరంగా అలంకరించగా భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు వడపప్పు, పానకం ప్రసాదాలు అందించారు. మండలంలోని దిగువ అయనంబాకం, ఎగువ అయనంబాకం రామాలయాల్లో, మేళపట్టు శ్రీరామాలయంలో, రాజుల కండ్రిగలోని రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయాలు విద్యుత్ దీపాలతో కళకళలాడాయి.

కార్వేటినగరం: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో వెలసిన శ్రీసీతారామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, తోమాల, పంచాగశ్రవణం నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌కు ఏకాంత తిరుమంజనం నిర్వహించి సీతారాములతో పాటు లక్ష్మణుడి ఉత్సవమూర్తులను పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. భక్తాగ్రేశుడైన రాములవారు హనుమంత వాహనంపై దర్శనమిచ్చారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం

శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీసీతారాముల వారి కల్యాణాన్ని వేద పండితులు వేదమంత్రాల నడుమ సీతమ్మ శిరస్సుపై ముత్యాల తలంబ్రాలు పోసి నేత్రపర్వంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు.

సర్వభూపాల వాహనంపై విహారం..

శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని వేద పండితులు సీతారాముల సమేత లక్ష్మణ ఉత్సవ మూర్తులను అలంకార మండపానికి వేంచేపు చేసి పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సర్వభూపాల వాహనంపై ప్రతిష్ఠించి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు గ్రామవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్‌కుమార్, వేదపండితులు నారాయణ దాసరి, గోపాలాచారి, సిబ్బంది కృష్ణయ్య, సుజాతమ్మ, మదన్‌గోపాల్ పలువురు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..

వెదురుకుప్పం: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరిపై కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో పెళ్లిపందిరి ఏర్పాటు చేశారు. తదుపరి స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను వేంచేపు చేసి పట్టు పీతాంబరాలు పుష్పాలతో ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని కనులవిందుగా చేశారు. ముత్యాల తలంబ్రాలతో దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలంలో శ్రీరామనవమి వేడుకలు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీసీతారాముల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు శ్రీసీతారాములను కీర్తిస్తూ భజనలు చేశారు. వేల్కూరులోని శ్రీసీతారాముల మందిరంలో విశేష పూజలు చేపట్టారు. అనంతరం శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు. రాత్రి అన్నదానం చేశారు. ఉపసర్పంచ్ సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. మహదేవమంగళం సమీపంలోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా సీతారామ కల్యాణం

నింద్ర: మండలవ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో సాయంత్రం సీతారామ కల్యాణం నిర్వహించారు. కేఆర్ పాళెం గ్రామంలో, కావునూరు, అత్తూరు, మేళంబాకం గ్రామాల్లో వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామంలోని యువకులు, భక్తులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలవ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. కృష్ణజమ్మపురం గ్రామంలో వెలసిన ద్రౌపదీ అమ్మవారి ఆలయ ఆవరణలో ఉన్న అనుమాన్ విగ్రహం ఎదుట శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణ సమేత హనుమంతుడి విగ్రహానికి వేదపండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం భక్తులు స్వామివారిని క్యూలో నిలిచి టెంకాయలు కొట్టి కర్పూరం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

వడమాలపేటలో..

వడమాలపేట: మండలవ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచే అన్ని రాముల వారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో, పచ్చని తోరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. బట్టీకండ్రిగ, వసంతనగర్, వడమాల, వడమాలపేట ఆలయాల్లో గ్రామస్తులు రాముల వారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు.






బట్టీకండ్రిగ గ్రామంలో రాములవారి కల్యాణం, భేరివీధి రామాలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు, నింద్రలో సీతారామ కల్యాణం, వేల్కూరులో శ్రీసీతారాముల ఊరేగింపు





శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు, హనుమంత వాహనంపై దర్శనమిస్తున్న శ్రీసీతారాములవారు, సర్వభూపాల వాహనంపై సీతా రాములవారు, కోలాటాలు ఆడుతున్న చిన్నారులు

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తా


తులసీరామ్‌ను సన్మానిస్తున్న నాయకులు

పాలసముద్రం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని 2024లో పార్టీ గెలుపునకు తనవంతు కృషి చేస్తానని మండల కన్వీనర్ తులసీరామ్ యాదవ్ తెలిపారు. గురువారం మండల కన్వీనర్‌గా నియమితులైన ఆయనను స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆశీస్సులతో పాలసముద్రం మండల కన్వీనర్‌గా తనకు అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి అడుగుజాడల్లో పార్టీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలతో కలసి పని చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, ఆర్బీకే చైర్మన్ పోలయ్య, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, గాలి మహేష్‌బాబు, నాయకులు సుబ్రమణ్యరెడ్డి, సుందర రాజు, ఇందిరమ్మ, కేశవరెడ్డి, షణ్ముగరెడ్డి, అరుల్, చంద్రశేఖర్‌రాజు, పద్మనాభనాయుడు, ఆనందన్, సుబ్రమణ్యరాజు, లోకమండడి మదివానన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై కరకంఠేశ్వరుడు


భక్తులను కటాక్షిస్తున్న కరకంఠేశ్వర స్వామి

నగరి: పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కరకంఠేశ్వర స్వామిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. నగరి మర్చంట్స్ అసోసియేషన్ వారు ఉత్సవాలకు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేక, అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఊరేగింపుగా వచ్చిన స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోదండ రాముడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

చంద్రగిరి: పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో గురువారం ఉదయం ధ్వజారోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం దేవేరులను సర్వాంగసుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 7.45 నుండి 8.15 గంటల మధ్య మేష లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్ఛరణలు, భక్తుల రామనామస్మరణ మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై అధిష్ఠింపజేశారు. కార్యక్రమంలో కంకణ భట్టార్ శ్రీనివాస భట్టార్, డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు గడపగడపకు ..

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ శేఖర్‌రాజు తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పాల్గొంటారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటారన్నారు. అలాగే గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

స్విమ్స్‌లో చైర్ ఓరియేషన్ విజయవంతం


చైర్ ఓరియేషన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

తిరుపతి తుడా: స్విమ్స్ న్యూరోసర్జరీ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 8వ చైర్ ఓరియేషన్ కార్యక్రమం విజయవంతమైంది. ఇందులో కేరళ రాష్ట్రం తిరువనంతపురం శ్రీచిత్రతిరునార్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ సంజయ్‌బిహారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన బయో ఎథిక్స్ ఇన్ మెడిసిన్ అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చరణ్ బిసింగ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ వివి రమేష్‌చంద్ర పాల్గొన్నారు.

నేడు తిరునాళ్లపై సమీక్ష

డక్కిలి: మండలంలోని దేవుని వెల్లంపల్లిలో వెలసిన స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో ఏప్రిల్ 9వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరగనున్న స్వామివారి తిరునాళ్లకు సంబంధించి ఆలయ ప్రాంగణంలో గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీధర్‌నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు 'సంకెళ్లను తెంచుకుంటూ' పుస్తకావిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ జిల్లా జడ్జి గురప్ప, సిద్ధోజీరావు

తిరుపతి కల్చరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు ఆత్మకథగా వెలువడిన సంకెళ్లను తెంచుకుంటూ పుస్తకాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఎస్వీయూ సెనేట్ హాల్లో ఆవిష్కరించనున్నట్టు విశ్రాంత జిల్లా జడ్జి పి.గురప్ప, ఐఏఎస్, ఐపీఎస్ గ్రూప్ ఫోరం కన్వీనర్ సిద్ధోజీరావు తెలిపారు. వారు గురువారం ప్రెస్‌క్లబ్‌లో పుస్తకావిష్కరణ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కాకి మాధవరావు ఐఏఎస్ అధికారిగా సుదీర్ఘ కాలం సేవలు అందించారని తెలిపారు. హైదరాబాద్‌లో స్థాపించిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, కేబీఆర్ పార్క్, ఏపీ స్టడీ సర్కిల్, రెసిడెన్సియల్ పాఠశాలల ఏర్పాటులో ఆయన కృషి చాలా ఉందని తెలిపారు. సంకెళ్లను తెంచుకుంటూ పుస్తకంలో తను పాలేరు నుంచి చీఫ్ సెక్రటరీగా ఎలా ఎదిగారో కాకి మాధవరావు వివరించారని తెలిపారు. ఈ పుస్తకం నేటి విద్యార్థులకు, భావితరాల వారి లక్ష్య సాధనకు దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎస్వీయూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ పుస్తక ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నేతలు, బహుజనులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. సమావేశంలో అంబేడ్కర్ ఆర్మీ నేత డాక్టర్ గోపి, టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నేతలు ఎం.ప్రసాద్‌రావు, జె.భాస్కర్, గాలి సుధాకర్, బ్లూవింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధి గిరి, సురేష్, రమేషబాబు క్రిష్ణమూర్తి, బి.శ్రీనివాసులు, సీనియర్ జర్నలిస్టు నాగరాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ హామీ అమలు చేయాలి

వెంకటగిరి: బీజేపీ ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ హామీని అమలు చేసే దిశంగా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ నేత పల్లిపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో చేపట్టిన నియోజకవర్గంలోని మాదిగపల్లెలను కలుపుతూ 367 కిలోమీటర్లు పాదయాత్ర గురువారం వెంకటగిరి చేరుకుంది. ఈసందర్భంగా స్థానిక క్రాస్ రోడ్డు నుంచి పోలేరమ్మ ఆలయం వరకూ మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించి అనంతరం అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీవర్గీకరణ చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని, ఇప్పటికైనా హామీ అమలు చేయకుంటే మాదిగలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. నేతలు పి.రవిమాదిగ, ఎం.సురేష్‌మాదిగ, కె.మణి, ఎల్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా బాలాలయ పూజలు


వీరభద్రస్వామి ఆలయంలో బాలాలయ పూజలు


చక్రేశ్వరస్వామి ఆలయంలో పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయాలైన వీరభద్రస్వామి ఆలయం, వేడాంలోని కాలభైరవస్వామి, ఆలయం పట్టణంలోని చల్లేశ్వరస్వామి ఆలయం, చక్రేశ్వరస్వామి ఆలయాల్లో గురువారం శాస్త్రోక్తంగా బాలాలయ పూజలు చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ స్థానాచార్యులు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో సంకల్ప పూజలు, కలశ పూజలు హోమ పూజలు నిర్వహించారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, ఉప ప్రధానార్చకులు కరుణాకర్‌గురుకుల్ అభిషేక గురుకుల్, నిరంజన్‌గురుకుల్, పాలకమండలి సభ్యులు పసల సుమతి, ఆలయ వేదపండితులు, అర్చకులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.